ధర్మం విషయంలో బలవంతంగాని నిర్బంధం గాని
ఏమీ లేదు. సత్యవాక్కు అసత్యవాక్కునుండి వేరు
చేయడం జరిగింది. (ఖుర్ఆన్ 2:256)

**యూనివర్సల్ ఇస్లామిక్ రీసర్చ్ సెంటర్**

ఇ.నెం. 2-3-732/1/ఎ, జిందాతిలిస్మాత్ రోడ్,

6 నెం చౌరస్తా, అంబర్‌పేట్,

హైదరాబాద్ - 500 013.

మరిన్ని వివరాలకు సంప్రదించండి :

సెల్ : 9885581028, 9885822474

# హిందూత్వము,
# క్రైస్తవ్యం మరియు
# ఇస్లాం లో
# వాస్తవ దైవ భావన

**ముక్కలైన మానవ సమాజాన్ని సమైక్యపరిచే**

**ఏకైక సాధనం సామూహిక దైవ భావన ఒక్కటే**

---

**UNIVERSAL ISLAMIC RESEARCH CENTRE**

## U I R C
## సంస్థ ప్రధాన ఆశయం

ధార్మిక గ్రంథాల అధ్యయనం ద్వారా
మత సామరస్యం
జాతీయ సమైక్యతా
మరియు
విశ్వమానవ సౌభ్రాతృత్వ
భావనలను
పెంపొందించేందుకు కృషి,

ప్రతి మనిషి ఇహలోకంలో సుఖం
మరియు
పరలోకంలో మోక్షం కోసం
పరితపిస్తాడు.
పై రెండు లభించాలంటే
మానవుడు ధార్మిక గ్రంథాల
వెలుగులో తన విశ్వాసాన్ని
ఆచరణను మలుచుకోవాలి.

*Contd...1*

అనంత కరుణామయుడు, అపారకృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

ప్రియమైన ఆత్మీయ సోదరులారా!

ఈనాడు ప్రపంచంలో అనేక మతాలున్నాయి. ప్రతి మతానికి అనేకమంది దేవుళ్ళున్నారు. యితే ఇంత మంది దేవుళ్ళలో నిజమైన దేవుడు ఎవరు? ఆయనను ఎలా తెలుసుకోవాలి? ఇలాంటి ప్రశ్నలు మనలో ప్రతి మనిషికి తన జీవితకాలంలో వేధిస్తూ ఉంటాయి. మనం స్వయం పరిశీలన చేయకుండా ఇతరులమీద ఆధారపడడం వలన అసంపూర్తి సమాధానాలతో సంతృప్తి చెందుతుంటాము.

మన మతాలు మరియు మన ధార్మిక గ్రంథాలు ఒకే దేవుని గురించి చెబుతున్నాయా? లేక అనేక దేవుళ్ళ గురించి ప్రస్తావిసున్నాయా? రండి నిష్పక్షపాత హృదయంతో, సత్యాన్వేషణతో పరిశీలిద్దాం. దేవుళ్ళు ఎందరు? అనే అంశంపై ధార్మిక గ్రంథాల పరిశీలన చేసే ముందు ఒక విషయం ఆలోచిద్దాం. ఒక్కో మతానికి ఒక్కో దేవుడు లేక అనేక దేవుళ్ళు వుంటే ప్రపంచలోని మానవులందరూ ఒకే శరీర నిర్మాణాన్ని ఎలా కలిగియున్నారు? ఈ విశాల సృష్టి అంతా ఒక క్రమబద్ధంగా నియమబద్ధంగా ఎలా నడుస్తూ ఉంది? దేవుళ్ళ మధ్య 'పోటీ' వల్ల సృష్టి అంతా అస్తవ్యస్తం ఎందుకు అవ్వడం లేదు?



ఎందుకంటే ఈ అనంత విశ్వాన్ని అందులో సకల జీవరాశులను సృష్టించి, సృష్టిని ఒక క్రమబద్ధంగా నడుపుతున్నది ఒకే దేవుడు గనుక. దేవుడు ఒక్కడు గాక అనేక మంది ఉంటే ప్రతి మతం దేవుడూ తన్ను ఆరాధించే ప్రజలను తన ఇష్ట ప్రకారం సృష్టించుకునేవాడు. దేవుళ్ళ మధ్య ఆధిపత్య పోరాటం జరిగి సృష్టి అంతా అల్లకల్లోలం అయిపోయి యుండేది. కాబట్టి మనిషిని, మనిషితో పాటు సకల జీవజాతులను, మనిషి మనుగడ కోసం ప్రకృతిని సృష్టించి ఒక ప్రణాళికా బద్ధంగా నడుపుతున్న ఆ మహాశక్తిశాలి ఒకే దేవుడు. ఆ దైవాన్నే వివిధ భాషలలో వివిధ పేర్లతో పిలుస్తారు. సంస్కృతంలో సర్వేశ్వరుడు, తెలుగులో దేవుడు, అరబీ భాషలో అల్లాహ్, హిబ్రూ భాషలో యెహోవా ఇలా భాషలు వేరైనా ఆ దేవుడు మాత్రం ఒక్కడే.

దేవుని గురించి అంతిమ దైవ గ్రంథం ఖుర్‌ఆన్ ఏమి చెబుతుంది?

**ఖుర్‌ఆన్:**

మీ దేవుడు ఒక్కడే. ఆ కరుణామయుడు, ఆ కృపాకరుడు తప్ప మరొక దేవుడు లేడు. **(ఖుర్‌ఆన్:2:163)**

అల్లాహ్ సజీవుడు, నిత్యుడు, విశ్వవ్యవస్థకు ఆధారభూతుడు వాస్తవానికి ఆయన తప్ప మరొక దేవుడు లేడు. **(ఖుర్‌ఆన్ 3:2)**



**దేవుని గురించి సనాతన వేద గ్రంథాలు ఏమి చెబుతున్నాయి?**

**వేదాలు:**

**య యేక ఇత్తము ష్తుహిః (ఋగ్వేదం 6:45:16)**

ఒక్కడు, సాటి సమానము లేని ఆయననే స్తుతించండి.

**మా చిరన్యద్విషంశత (ఋగ్వేదం 8:1:1)**

ఆ దేవుడికి తప్ప మరెవరినీ పూజించకండి. అప్పుడు మిమ్ములను ఏ బాధ బాధించదు.

**దేవో మహ బసి (అధర్వణవేదం 20:58:3)**

దేవుడు ఒక్కడే గొప్పవాడు.

**బ్రహ్మసూత్రం :**

**హైందవ వేదాంతము యొక్క బ్రహ్మ సూత్రం:**

యేకం బ్రహ్మం, ద్వితీయ నస్తేనన్ ననస్తేకించన్
దేవుడు (సృష్టికర్త) ఒక్కడే, ఆయన తప్ప మరొకడు లేడు.
కించిత్తు కూడా లేడు.
(సంస్కృతంలో బ్రహ్మ అంటే సృష్టికర్త అని అర్థం)



**ఉపనిషత్తులు :**

**యేకం యెవద్వితీయం (చందోగ్యఉపనిషత్ 6:2:1)**

ఆయన ఒక్కడు. ఆయన తప్ప మరొకడు లేడు.

ఎవరైతే ఈ లోకాలను తన ప్రభావంతో రక్షించి పాలిస్తాడో ఆ దేవుడు ఒక్కడే. (శ్వేతాశ్వతరోపనిషత్ 3:2)

**యేకే ఏవనో దూత్యో (కఠోపనిషత్)**

ఆయన ఒక్కడే, ఆయన అద్వితీయుడు.

**భగవద్గీత:**

భగవాన్ ఉవాచ:

**సర్వధర్మన్పరిత్యజ్య మామేకం శరణం వ్రజ**
**అహం త్వా సర్వ పాపేభ్యోమోక్షయిష్యామి మాశుచ:**

**(గీత 18:66)**

ఓ అర్జునా భగవంతుడు ఇలా చెబుతున్నాడు: "సమస్త ధర్మములను విడిచిపెట్టి నన్ను ఒక్కనిని మాత్రమే శరణు బొందుము. అప్పుడు నేను సమస్త పాపముల నుండి నిన్ను విముక్తున్ని చేసెదను."

*Contd...2*

భగవాన్ ఉవాచ:

**అనన్యాశ్చిన్త యన్తోమాం యే జనాఃపర్యుపాసతే**
**తేషాం నిత్యాభి యుక్తానాం యోగక్షేమం వహామ్యహం**

**(గీత 9:22)**

భగవంతుడు చెబుతున్నాడు ః "అర్జునా! అన్య దేవతారాధన చేయక నిత్యము ఎవడైతే నాయందు మనసు నిలిపి ఉంచుతున్నాడో, నాయందే చిత్తము చేర్చిన అట్టి వాని యోగక్షేమములు నేను విచారించుచున్నాను.

**బైబిల్**

**పాత నిబంధన గ్రంథంలో దేవుడు స్వయంగాః**

భూదిగంతముల నివాసులారా! నావైపు చూచి రక్షణ పొందుడి. దేవుడను నేను మరి ఏ దేవుడునూ లేడు **(యెషయ 45:22)**

**క్రొత్త నిబంధన గ్రంథంలో యేసు స్వయంగాః**

మీరు భూమి మీద ఎవనికైననూ తండ్రి (దేవుడు) అని పేరు పెట్టవద్దు. ఒక్కడే మీ తండ్రి (దేవుడు) ఆయన పరలోక మందున్నాడు. **(మత్తయి 23:9)**



ఈ విధంగా వేదాలు, ఉపనిషత్తులు, గీత, బైబిలు గ్రంథాలు దేవుడు ఒక్కడే అని ఘోషిస్తున్నప్పటికీ అనేక దేవుళ్ళు వెలుగులోనికి రావడానికి కారణమేమిటి? మనం ధార్మిక గ్రంథాలకు దూరంగా ఉండి ఎంతో ముఖ్యమైన దేవుని విషయంలో మన పెద్దలపై, గురువులపై అధ్యాత్మిక పండితులపై ఆధారపడడం. దేవుని అస్థిత్వం, ఆయన గుణగణాలు, అధికారాలు, హక్కులు, ఆయన శక్తి సామర్థ్యాల గురించి సరైన అవగాహన లేకపోవడం. దేవుని అస్థిత్వం గుణగణాలు మనకు తెలియని కారణంగా దేవుడు మనిషిలా అవతరిస్తాడని భార్యాబిడ్డలు ఉంటారని మనిషికుండే బలహీనతలు ఉంటాయని భావిస్తున్నాము. కాని ఆ ఏకైక దేవుని గుణకర్మ స్వభావాలను గురించి మన గ్రంథాలు ఏమంటున్నాయో ఒకసారి పరిశీలిద్దాము.

**దేవుని రూపముః**
**ఆయన (అల్లాహ్)ను పోలినది ఈ సృష్టిలో ఏదిలేదు**
**(ఖుర్ఆన్ 42:11)**

ఆయనకు సాటి పోలిక ఎవరూ లేదు. ఆయనకు పుట్టక లేదు. కనుక పూజకు అర్హుడు **(యజుర్వేదం 40:8 మరియు 32:3)**

**న తస్య ప్రతిమ ఆస్థి** **(శ్వేతశ్వతరోపనిషత్ 4:19)**
**బైబిల్:** నేను దేవుడును నన్ను పోలినవాడెవడునూ లేడు.
**(యెషయా 46:9)**



**దేవుడు కంటికి కనిపించడు. ఏ చూపులు కూడా ఆయనను అందుకోలేవు, కానీ ఆయన అన్ని చూపులను పరీక్షించి ఉన్నాడు.**
**(ఖుర్ఆన్ 6:103)**

ఆయనకు సాటి సమాన రూపము ఏది లేదు.

**స సందృశే తిష్ఠతి రూపమస్య నచక్షుషా పశ్యతి కశ్చనైనమ్**
**(శ్వేతశ్వేతరోపనిషత్ 4:20)**

దేవుని రూపం ఇంద్రియాల పరిధిలో నిలువదు. కన్నులతో ఆయన్ను ఎవరూ చూడలేదు.

ఈ సమస్త ప్రపంచం అవ్యక్త రూపుడగు (చెప్పుటకు వీలుగాని రూపం) నాచే వ్యాపించబడియున్నది. **(గీత 9:4)**

నేను సర్వజ్ఞుడను, పురాతనుడను, సర్వలోక ప్రభువును, అణువుకంటే మిక్కిలి సూక్ష్మమైనవాడను. సమస్త ప్రపంచానికి ఆధారమైనవాడను. ఆలోచింపశక్యముకాని రూపం గలవాడను, స్వయం ప్రకాశుడను, జ్ఞానిని. **(గీత 8:9-10)**

నేను ఇట్టిదని నిర్దేశిపంశక్యము కాని, ఇంద్రియాలకు గోచరము కాని, ఆలోచింపశక్యము కాని రూపంగలవాడిని, బలహీనతలు లేనివాడిని, స్థిరమైనవాడిని, సర్వజ్ఞానిని. **(గీత 12:3-4)**



ఎవరైతే అగోచరుడని (కంటికి కనిపించనివాడు) నాశరహితుడని (చావులేని) చెప్పబడెనో అతనిని వేదవేత్తలు సర్వోత్తమమైన స్థానంగా చెబుతున్నారు. **(గీత:8:21)**

కావున మీరు ఎవనితో దేవుని పోల్చుదురు? ఏ రూపమును ఆయనకు సాటి చేయగలరు? **(బైబిలు యెషయా 40:18)**

మీరు ఏ కాలమందైనను ఆయన స్వరము వినలేదు. ఆయన స్వరూపము చూడలేదు. **(యోహాను 5:37)**

**దేవునికి పుట్టక లేదు ః**

ఆయన ఎవరికి జన్మించలేదు, ఆయనకు ఎవరూ జన్మించలేదు.
**(ఖుర్ఆన్ 112:3)**

ఆయన జన్మించినవాడు కాడు. **(యజుర్వేదం 32:3)**

**న తస్య కశ్చిత్ పతిరస్తి లోకే న చేశితా నైవచ తస్య లింగమ్ !**
**స కారణం కరణాది పాధిపో న చాస్యకశ్చిజ్జనితా న చాధిపః!**
**(శ్వేతశ్వతరోపనిషత్ 6:9)**

ఆయనకు తల్లిదండ్రులు లేరు. ఆయనకు ప్రభువు లేడు. (ఆయనే ప్రభువు). ఆయనకు గురువు లేడు. పోలిక లేదు. ఆయనే మూలం. ఆయనకు సంరక్షకుడు లేడు.

*Contd...3*

ఎవడు నన్ను పట్టుక లేనివాని గాను, ఆది లేని వానిగాను, సర్వలోక ప్రభువుగాను తెలుసుకుంటాడో అతడు అజ్ఞానము వీడి సమస్త పాపముల నుండి లెస్సగా విడువబడుచున్నాడు.
**(గీత 10:3)**

నాకు ముందుగా ఏ దేవుడునూ నిర్మింపబడలేదు. నా తర్వాత ఏ దేవుడునూ నుండడు. నేను నేనే యెహోవాను. నేను తప్ప వేరొక రక్షకుడు లేడు. **(బైబిలు యెషయ 43:10)**

దేవుడు నరపుత్రుడు కాడు. **(బైబిలు సంఖ్యాకాండము 23:19)**

**దేవునికి మరణం (నాశనం) లేదు:**

ఆయన (అల్లాహ్) సజీవుడు, ఎన్నడూ మరణించని వాడు.
**(ఖుర్ఆన్ 25:58)**

జననము, మరణము అనే దోషములు లేనివాడే శుభప్రదుడైన దేవుడు. **(యోగశిఖోపనిషత్)**

ఈ సమస్త ప్రపంచం దేనిచేత వ్యాపించబడి యున్నదో అది నాశరహితము, అవ్యయమగు అట్టి సత్ పదార్థమునక ఎవడునూ వినాశనము కలుగజేయజాలడు. **(గీత 2:17)**

యెహోవాయే నిజమైన దేవుడు. ఆయనే జీవము గల (చావులేని) దేవుడు. **(బైబిలు-యిర్మియా 10:10)**

జీవము గల తండ్రి (దేవుడు) నన్ను పంపెను.
**(బైబిలు-యోహాను 6:57)**



**దేవుడు మానవ అవతారం ధరించడు:**

ఇది సకలలోకాల ప్రభువు అవతరింపజేసినది దీనిని తీసుకొని విశ్వసనీయమైన ఆత్మ (జిబ్రీల్ దూత) నీ మొహమ్మద్ (స) హృదయ పలకం పై అవతరించింది. **(ఖుర్ఆన్ 26:192-194)**

**నోట్:** దైవ సందేశం అందజేసే నిమిత్తం దేవుడు తన దూతను అవతరింపజేస్తాడే తప్ప దేవుడు మాత్రం మానవ అవతారం ధరించి ఇహలోకానికి రాడు అని స్పష్టమవుతున్నది.

నాశరహితమైనట్టియు, సర్వోత్తమమైనట్టియు,

సర్వశ్రేష్టమైనట్టియు, నా రూపము తెలియని అవివేకులైన ఈ జనులు అవ్యక్తరూపుడగు నన్ను (చెప్పటానికి వీలులేని రూపం) మానవఅవతారం దాల్చినవానిగా భావించుచున్నారు.
**(గీత 7:24)**

నిశ్చయముగా దేవుడు ఈ లోకమందు (ప్రపంచంలో) నివాసము చేయడు. **(బైబిలు 1 రాజులు 8:27)**

దేవుడు అబద్దమాడుటకు ఆయన మానవుడు కాడు. నరపుత్రుడు కాడు. **(సంఖ్యాకాండం 23:19)**



**దేవుడు సర్వశ్రేష్టుడు, గొప్పవాడు**

అల్లాహ్ మాత్రమే సర్వాధికుడు, సర్వోత్తముడు.
**(ఖుర్ఆన్ 2:255)**

కామము, క్రోధము, భయము, మోహము, లోభము మదము, రజోగుణము, జననము, మరణము, కార్పణ్యము, శోకము, సోమరితనము, ఆకలి దప్పిక, ఆశ, లజ్జ, దుఃఖము, విషాదము, సంతోషము అను ఈ దోషముల బలహీనత లేనివాడే దేవుడు, అయనే శుభప్రదుడు. **(యోగశిఖోపనిషత్)**

నా కంటే శ్రేష్టమైనది మరియొకటి లేనేదేదు. **(గీత 7:7)**

తండ్రి (దేవుడు) అందరికంటే గొప్పవాడు.
**(బైబిలు యోహాను 10:29)**

ఈ విధంగా దేవుని రూపాన్ని వివరించలేమని, ఆయనకు చావు పుట్టుకల వంటి బలహీనతలులేవని సర్వశ్రేష్టుడు గొప్పవాడు అయిన ఆ దేవుడు మానవునిగా అవతరించడని మన గ్రంథాలు స్పష్టంగా బోధిస్తున్నాయి.

**సృష్టికర్తను విడచి సృష్టిని (ప్రకృతి, మానవులు) పూజిస్తే ఏమౌతుంది?** అనే విషయాన్ని పరిశీలిద్దాము.



**భహుదైవారాధన - పర్యవసానం**

అల్లాహ్‌తోపాటు ఇతరులను అల్లాహ్‌కు భాగస్వాములుగా చేసేవారికి అల్లాహ్ స్వర్గాన్ని నిషిద్ధం చేసాడు, వారి నివాసం నరకం అటువంటి దుర్మార్గులకు సహాయం అందించేవాడు ఎవడూ లేడు. **(ఖుర్ఆన్ 5:72)**

**అంధఃతమ ప్రవిషన్తియె అసంభుతి ముపాసతే తతోభుయ ఇవతేతమోయాఊః సంబుత్యాగ్రతః (యజుర్వేదం 40:9)**

ఎవరైతే ప్రాకృతిక వస్తువులను (గాలి, నీరు, మొ॥ వాటిని పూజిస్తారో వారు చీకటి (నరకం)లో ప్రవేశిస్తారు. ఎవరైతే సంభుతి (సృష్టితాలు-మానవునిచేత తయారయ్యే వస్తువులు బొమ్మలు) ని పూజిస్తారో వారు మరింత అంధకారంలో ప్రవేశిస్తారు.

అల్పబుద్ధి కలిగిన వారి యొక్క ఆ స్థలము నాశవంతమైయున్నది. దేవతలను పూజించువారు దేవతలనే పొందుచున్నారు నా భక్తులు నన్నే పొందుచున్నారు.
**(గీత: 7:23)**

నరులను ఆశ్రయించి శరీరులను తనకాధారముగా చేసుకొనుచు తన హృదయమును యెహోవామీద నుండి తొలగించు కొనువాడు శాపగ్రస్తుడు. **(యిర్మియా 17:5)**

*Contd...4*

ఈ విధంగా మన ధార్మిక గ్రంథాలు ఏకేశ్వరోపాసన గురించి ప్రభోదిస్తూ దాని ఫలితం స్వర్గమని తెలియజేస్తూ మరొక వైపు భహుదైవారాధన గురించి హెచ్చరిస్తూ దాని పర్యవసానం నరకమని తెలియజేస్తున్నాయి.

**దేవుని చేరే మోక్షమార్గమేది?**

మానవులారా మిమ్మల్ని మీకు పూర్వం వారిని సృష్టించిన ఆమీ ప్రభువు (అల్లాహ్)నే ఆరాధించండి దీని ద్వారానే మిమ్మల్ని మీరు (నరకం నుండి) రక్షించుకునే అవకాశం ఉంది.

**(ఖుర్ఆన్ 2:21)**

చాలా మంది అందరికీ దేవుడు ఒక్కడని అంగీకరిస్తూనే వివిధ మతములు ఆ దేవుని చేరే వివిధ మార్గములు అంటారు. కానీ ఇది సరికాదు. ఆది నుండి దేవుడు తనను చేరే ఋజు మార్గం కూడా ఒక్కటే అని గ్రంథాల ద్వారా తెలియజేశాడు. మానవుడు సంపూర్ణంగా తన సృష్టికర్తకు లొంగిపోయే మార్గమే దేవుని చేరు ఏకైక మార్గం (దీనిని అరబీ భాషలో ఇస్లాం అంటారు.)

జ్ఞానులు, ఋషులు తమ మనస్సును, తమ ఆలోచనలను పరమ సత్యమును, సర్వాజ్ఞాని, గొప్పవాడు, సర్వశ్రేష్ఠుడు అయిన దేవుని యందు ఏకాగ్రత (సమర్పణ) పరచుచున్నారు.



**(ఋగ్వేదం 5:81:1)**

ఆయన యందే బుద్ధిగల వారు, ఆయన యందే మనసు నెలకొల్పినవారు, ఆయన యందే నిష్టగలవారు, ఆయన్నే పరమ గతిన నెంచువారు. జ్ఞానముచే ఎగురగొట్టబడిన పాపము గలవారై శాశ్వత మోక్షాన్ని పొందుచున్నారు. **(గీత 5:17)**

ఎవరు సమస్త కర్మలను నాయందు సమర్పించి, నన్నే పరమగతిగా తలంచిన వారై అనన్య చిత్తముతో నన్నే ధ్యానించుచూ ఆరాధిస్తున్నారో నాయందు చిత్తము చేర్చిన అట్టి వారిని నేను లేవదీయుచున్నాను. **(గీత 12:7)**

ఎవడు దీనుడై నలిగిన హృదయము గలవాడై నా మాట విని ఒణుకుచుండునో వారినే నేను దృష్టించుచున్నాను.

**(బైబిల్-యెషయా 66:2)**

**గురునానక్:**

శిక్కు మత స్థాపకులు. గురుగ్రంథ సాహెబ్ (Vil - 1, Japuji Verse 1) లో ఇలా అన్నారు.

ఒక్క దేవుడు తప్ప మరొకడులేడు. ఆయన నిజమైన సృష్టికర్త మానవ బలహీనతలకు అతీతుడు. చావు పుట్టుకలు లేని వాడు, స్వయంభవుడు, గొప్పవాడు, కరుణామయుడు.



**జోరాస్ట్రియన్ మతం:**

దేవుడు ఒక్కడే. ఆయనకు పోలిక లేదు. ఆది అంతం లేదు. తల్లిదండ్రులు, భార్యాబిడ్డలు లేరు. ఏ కనులు ఏ శక్తి ఆయన్ను చూడలేదు. ఆయన ఇంద్రియాలకు అగోచరుడు. ఆయన అత్యంత సమీపంలో ఉన్నాము.

**(దసతీర్ గ్రంథం)**

**షిర్డీ సాయిబాబాః**

అనుక్షణం మూడు మంత్రాలు చదివేవారు.
సబ్‌కా మాలిక్ ఏక్ హై – అందరి దేవుడు ఒక్కడే
అల్లాహ్ మాలిక్ – అల్లాహ్ యే దేవుడు
అల్లాహ్ భలా కరేగా – అల్లాహ్ మంచి చేస్తాడు.

**షిర్డీ సాయిబాబా జీవిత చరిత్ర శ్రీ సాయిలీలామృతం**

**రచన: ఎక్కిరాల భరధ్వాజ**

సాయిబాబా : అల్లాహ్‌ను స్మరిస్తూ మసిదులోను, గ్రామపరిసరాలలోని చిట్టడవిలోను, ఏటి ఒడ్డునున్న తుమ్మ చెట్టు క్రిందనో ఒంటరిగా కాలం గడుపుతుండేవారు. **(పేజీనం.18)**

ఆయన (బాబా) ఏకాంతంగా ధ్యానంలో కూర్చొని ఉండేవారు.

**(పేజీనం.19)**



**శ్రీరాముల వారుఃరామాయణం బాలకాండంః**

| | | |
|---|---|---|
| **కౌసల్యాసుప్రజారామా** | : | కౌసల్యకు పుట్టిన ఓ మంచి పిల్లవాడా రామా |
| **పూర్వాసంధ్యాప్రవర్తతే** | : | సూర్యోదయానికి వేళ అవుతుంది. |
| **ఉత్తిష్టా (నిదుర)** | : | లే |
| **నరాషార్దూలా** | : | నరులలో పులివంటివాడా |
| **కర్తవ్యం దైవ మాహ్నికం** | : | ఆ దైవాన్ని ఆరాధించుట నాయొక్క కర్తవ్యం |

శ్రీరాములు వారిని తన గురువుగారైన విశ్వమిత్రుల వారు ఆ సృష్టికర్తను ఆరాధించుటకు వేకువజామునే లేపేవారు.

**నోట్:** రాముల వారు యుద్ధ రంగంలో బాణం తీసి విల్లు ఎక్కుపెట్టే ముందు పైకి చూసి దైవాన్ని స్మరించి బాణాన్ని వదిలేవారు.

**శ్రీ కృష్ణుల వారుః**

ఓ అర్జునా! ఎల్లవేళలా ఆ సర్వేశ్వరుడినే శరణుపొందుము ఆయన అనుగ్రహముచే సర్వోత్తమ శాంతిని శాశ్వత మోక్షాన్ని పొందగలవు. **(గీత 18:62)**

**యేసు వారు కూడా ఆ దైవాన్నే ఆరాధించమనే చెప్పెను.**

మన దేవుడైన ప్రభువు అద్వితీయ ప్రభువు (యహోవ), నీవు నీ పూర్ణ హృదయముతో నీ పుర్ణాత్మతో, నీ పూర్ణ వివేకముతో, నీ పూర్ణ బలముతో నీ దేవుడైన ప్రభువు (యహోవ) ను ఆరాధింపవలెను. **(బైబిలు-మార్కు 12:30-32)**

నీవు ప్రార్థన చేయునప్పుడు నీ గదిలోనికి వెళ్ళి తలుపువేసి రహస్య మందున్న నీ తండ్రి (యెహోవ)కి ప్రార్థన చేయుము. అప్పుడు రహస్యమందు చూచు నీ తండ్రి (యెహోవ) నీకు ప్రతిఫలమిచ్చును. **(మత్తయి 6:6)**

**అంతిమ దైవప్రవక్త ముహమ్మద్(స) చెప్పారుః**

ఓ మానవులారా మీరు అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యదైవం ఎవరూ లేరని విశ్వసించండి, మీరు సాఫల్యం పొందుతారు. **(హదీస్)**

దేవుడు ఒక్కడే. ఆయన్ను ఆరాధించడం తప్ప మరో మార్గం లేదన్న సత్యాన్ని గ్రహించిన కారణముగా ప్రపంచంలో అనేక మంది పుణ్యపురుషులు ఈ సత్యాన్నే బలపరిచారు. కాని దురదృష్టవశాత్తు ఆ మహానీయులు తదనంతరం అవి ఆచరణలో కనుమరుగై పోయాయి.



ఈ విధంగా ప్రపంచంలో ఎందరో పుణ్యపురుషులు, మునులు, మహర్షులు, ప్రవక్తలు ఆ ఏకైక దేవుని గురించే బోధించి ఆయనను మాత్రమే ఆరాధించమన్నారు. కానీ ప్రజలు దురదృష్టవశాత్తు సందేశమిచ్చిన ఆ మహానీయులనే దైవాలుగా మార్చివేశారు. దీనికి కారణం వారిపై ఉండే అమితమైన ప్రేమ గౌరవం. కాని ఈ ప్రేమ గౌరవం మనలను దైవాగ్రహానికి గురిచేస్తే ఆ తప్పు ఆమహాపురుషులది ఏమాత్రం కాదు. మనదే కాబట్టి ఆ పుణ్యపురుషులను గౌరవించాలి, ప్రేమించాలి. కానీ ఆరాధనలు, పూజలు, మొక్కుబడులు ఆ ఏకైక దేవునికే చేయాలి. ఎందుకంటే ఆ మహానీయులు సహితం ఆయననే ఆరాధించారు కనుక. ఇదే సరైన మోక్షమార్గం. తాము దైవాలమని తమ్ము ఆరాధించమని వారు ఏనాడూ చెప్పలేదు.

**ఉదా:** యేసు తాను దేవుడనని చెప్పలేదు. సరికదా ఎవరైలా అలా అంటే స్వర్గంలో రాలేరని హెచ్చరించారు.

ప్రభువా ప్రభువా! అని నన్ను పిలుచు ప్రతి వాడునూ పరలోక రాజ్యము (స్వర్గం) లోనికి ప్రవేశించడు. గాని పరలోకమందున్న నా తండ్రి (దేవుని) చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును.

**(బైబిల్ మత్తయి 7:21)**



**ఎవరిని ఆరాధించాలి?**

నేను అల్లాహ్‌ను, నేను తప్ప మరొక దేవుడు లేడు. కనుక నీవు నాకు దాస్యం చెయ్యి **(ఖుర్ఆన్ 20:14)**

**ఏకభక్తిర్విశిష్యతే :** ఒక్క పరమాత్మయందే భక్తి గలవాడునగు జ్ఞాని శ్రేష్ఠుడగుచున్నాడు. **(గీత 7:17)**

**యేసు చెప్పెను:** నీ దేవుడైన ప్రభువు (యహోవ)నకు మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింపవలెను. **(లూకా 4:8)**

నోట్: బైబిల్ పరిభాషలో యెహోవాగా, సంస్కృతంలో సర్వేశ్వరునిగా, అరబీ భాషలో అల్లాహ్‌గా పిలువబడుతున్న ఆ సృష్టికర్తను వివిధ భాషలలో వివిధ పేర్లతో పిలిచినప్పటికీ ఆయన మాత్రం ఒక్కడే. ఆ ఒక్క సృష్టికర్తను మాత్రమే ఆరాధించాలి అనే విషయం అర్థమవుతుంది.

**మరణానంతర జీవితంః**

చివరకు ప్రతి మనిషి మరణిస్తాడు. మీరంతా మీ పూర్తి ప్రతిఫలాన్ని ప్రళయం నాడు పొందుతారు. అక్కడ నరకాగ్ని నుండి కాపాడబడి స్వర్గంలోకి ప్రవేశపెట్టబడే వాడు మాత్రమే యధార్థానికి సఫలీకృతుడు ఇక ఈ ప్రపంచం అది కేవలం మాయా వస్తువు మాత్రమే. **(ఖుర్ఆన్ 3:185)**



ప్రళయంనాడు ఆయన మీ అందరినీ తప్పకుండా సమావేశ పరుస్తాడు. ఇది అనుమానానికి ఏమాత్రం ఆస్కారం లేని యధార్థం. **(ఖుర్ఆన్ 6:12)**

అర్జునా! సమస్తప్రాణికోట్లు ప్రళయ కాలమున నా ప్రకృతిని జేరి అందు అణిగియుండును. తిరిగి సృష్టికాలమున వాణిని మరల నేను సృజించుచున్నాను. **(గీత 9:7)**

దీనికి ఆశ్చర్యపడకుడి ఒక కాలము వచ్చుచున్నది. ఆ కాలమున సమాధులలో నున్న వారందూ ఆయన శబ్దమువిని మేలు చేసిన వారు జీవన పునరుత్థానమునకు, కీడు చేసిన వారు తీర్పు పునరుత్థానమునకు బయటికి వచ్చెదరు.

**(బైబిలు యోహాను 5:28-29)**

**నోట్:** ఇహలోక జీవితమే శాశ్వతము కాదు మరణానంతరం మనందరినీ సృష్టికర్త సమావేశపరుస్తాడు. అక్కడ మన కర్మల నిమిత్తం జవాబు చెప్పుకోవాలి. అనే విషయం ధార్మిక గ్రంథాల సందేశం ద్వారా తెలుస్తుంది.

**సృష్టికర్తను వదిలి ఇతరులను ఆరాధించిన వారికి**

**శాశ్వత నరకంః**

తమ ప్రభువు (అల్లాహ్)ను తిరస్కరించిన ప్రజలకు నరక శిక్షపడుతుంది. అది చాలా చెడ్డనివాసం. **(ఖుర్ఆన్ 67:6)**

*Contd...6*

గ్రంథప్రజలలో, బహుదైవారాధకులలో సత్యాన్ని తిరస్కరించిన వారు తప్పనిసరిగి నరకాగ్ని లోకే పోతారు. అందులోనే శాశ్వతంగా ఉండిపోతారు. **(ఖుర్ఆన్ 98:6)**

దుష్కార్యాలకు పాల్పడేవారిని లోతైన గోతిలోకి అంధకారంలో పడవేయండి. అక్కడ నుండి వారు బయటకు రాలేని విధంగా వారిలో ఏ ఒక్కడూ ఏనాటికి తిరిగి బయటకు రాడు.

**(ఋగ్వేదం 7:104:3)**

వీరు (అవిశ్వాసులు) నిత్యశిక్షకును, నీతి మంతులు నిత్య జీవమునకును పోవుదురు **(మత్తయి 25:46)**

పిరికి వారును, అవిశ్వాసులును అసహ్యులును నరహంతకులును విగ్రహారాధకులును, అబద్ధికులందరునూ అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు. **(ప్రకటన 21:8)**

**సృష్టికర్తను మాత్రమే ఆరాధించిన వారికి**

**శాశ్వత స్వర్గం:**

విశ్వసించి సత్కర్యాలు చేసేవారు నిస్సందేహంగా సృష్టిలో అత్యంత శ్రేష్టులు వారికి వారి ప్రభువు వద్ద లభించే ప్రతిఫలం శాశ్వతనివాస స్థలాలైన స్వర్గవనాలు **(ఖుర్ఆన్ 98:7-8)**



మరణరహితమైన, వెలుగులతో నిండిన శాశ్వత తేజస్సునిచ్చే పతన రహితమైన ఆలోకానికి నన్ను చేర్చు.

**(ఋగ్వేదం 9:113:7)**

స్వర్గంలో మనిషి ముసలివాడు కాదు, అక్కడ ఎవ్వరికీ మరణం అనేదేరాదు. **(అధర్వణవేదం 4:43:13)**

నీతిమంతులు (విశ్వాసులు) నిత్యజీవమునకు పోవుదురు.

**(మత్తయి 25:46)**

**మన ఇష్ట ప్రకారం జీవితం గడిపితే? (ఖుర్ఆన్ 4:57)**
**"యశ్శాస్త్ర విధిముత్సృజ్య వర్తతే కామకారతః**
**నస సిద్ధిమవాప్నోతి నసుఖం న పరాం గతిమ్"**

**(గీత 16:23)**

ఎవడు శాస్త్రోక్తమగు విధిని విడిచిపెట్టి తన యిష్టమువచ్చినట్లు ప్రవర్తించునో అట్టివాడు పురుషార్థసిద్ధిని గాని సుఖమును గాని ఉత్తమగతియగు మోక్షమును గాని పొందనేరడు.

"త్రివిధం నరకస్యేదం ద్వారం నాశనమాత్మనః
కామ క్రోధ స్తథా లోభస్తస్మాదేత త్త్రయం త్యజేత్".

**(గీత 16:21)**



కామము, క్రోధము, లోభము అను ఈ మూడును మూడు విధములగు నరక ద్వారములు. ఇవి జీవునకు నాశనము కలుగజేయును. కాబట్టి ఈ మూడింటిని విడనాడవలెను.

నేడు నీకాజ్ఞాపించు ఆయన సమస్త ఆజ్ఞలు కట్టడములు నీవు అనుసరించని యెడల నీ దేవుడైన యెహోవా సెవిచ్చిన మాట వినని యెడల ఈ శాపములన్నియు నీకు సంభవించును (ఇహ, పరాలలో శపించబడతావు) **(బైబిల్ ద్వితి॥కాండం 28:15)**

మా వాక్యాలను తిరస్కరించే వారి కోసం మేము నరకాగ్నిని సిద్ధం చేసి ఉంచాము. **(ఖుర్ఆన్ 4:57)**

**ఇస్లాం పరిచయం:**

గత గ్రంథాలలో మనిషి మోక్షానికి దేవుడు ఏ మార్గాన్ని ధర్మాన్ని బోధించాడో అదే ధర్మాన్ని అరబీ భాషలో ఇస్లాం (శాంతి) అని అంటారు. సర్వేశ్వరుడైన అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం జీవితాన్ని గడిపి ఆయనకు విధేయత చూపి, ఆయనకే సమర్పించుకుని శాస్త్రబద్ధంగా జీవించడాన్నే ఇస్లాం అంటారు. అలా చేసే వ్యక్తిని ముస్లీం (విధేయుడు) అని అంటారు. ఆది మానవుడు ఆదమ్ (అలై॥స) నుండి దేవుడు వివిధ గ్రంథాల ద్వారా వివిధ ప్రవక్తల ద్వారా మానవాళికి బోధించిన ధర్మమే ఇస్లాం. దీనిని దేవుడు తన చివరి ప్రవక్త మహమ్మద్ (స.అ.స) ద్వారా పరిపూర్ణం చేశాడు.



మనిషి పుట్టినప్పటి నుండి ఇప్పటి వరకూ సుమారు 1,24,000 మంది ప్రవక్తలు వివిధ కాలాలలో వివిధ భాషలలో వివిధ జాతులలో దేవుడు ఒక్కడే అనే సందేశాన్ని ఇచ్చారు. వారిలో చివరివారే మహమ్మద్ ప్రవక్త (ఆయనపై శాంతి వర్షించును గాక!) ఆయన ద్వారా దేవుడు మానవాళికి అందజేసిన చివరి దైవశాసనమే ఖుర్ఆన్ గ్రంథం.

**ముహమ్మద్ (స.అ.స) అందరి ప్రవక్త:**

గత ప్రవక్తలు ఒక ప్రత్యేక జాతికో, ప్రత్యేక కాలానికో పంపబడ్డారు. కాని మహమ్మద్ (స.అ.స) ప్రవక్త సకల మానవజాతికై ప్రవక్తగా పంపబడ్డారు.

ఓ ప్రవక్తా! మేము నిన్ను సకల మానవజాతికి ప్రవక్తగా చేసి పంపాము. దీనికి అల్లాహ్ సాక్ష్యం చాలు. **(ఖుర్ఆన్ 4:79)**

ముహమ్మద్ (స) ప్రవక్త కేవలం ముస్లింల ప్రవక్త మాత్రమే కాదు. మనందరికోసం దైవ సందేశాన్ని తెచ్చిన మనందరి ప్రవక్త.

**అంతిమ దైవ ప్రవక్త. ఈయన రాకకు పూర్వమే వేద వేదాంగాలు ఆయన వస్తారని పేరుతో సహా తెలియజేసాయి.**

Contd...7

**వేదాలలో ముహమ్మద్ (స)**

వేదాలలో మహానీయ ముహమ్మద్ (స) గురించి అనేక చోట్ల **'నరాశంస'** పేరుతో ప్రస్తావించడమైనది.

నరాశంసః **యో నరౌ ప్రశస్యతే** – ఏ మానవుడైతే ప్రశంసింపబడతాడో, సాయణ్ భాష్య, ఋగ్వేదసంహిత, 5–5–2) ఇది కర్మాధారయ సమాసము. దీని అర్థం ప్రశంసింపబడే మానవుడు ముహమ్మద్ అనే అరబీ పదం యొక్క అర్థం కూడా ఇదే.

**ఋగ్వేదం :** 1వ మండలం – 13 వ సూక్తం – 3వ మంత్రం

**2వ మండలం** – 3వ సూక్తం – 2వ మంత్రం

**5వ మండలం** – 5వ సూక్తం – 2వ మంత్రం

**7వ మండలం** – 2వ సూక్తం – 2వ మంత్రం

**10వ మండలం** – 64వ సూక్తం – 3వ మంత్రం.

**ఇదం జనా ఉప శ్రుత నరాశంస స్తవిష్యతే**
**షష్టిం సహస్ర నవతిం చ కౌరమ ఆ రుషమేఘు దద్మహే ॥**



ఓ ప్రజలారా ! శ్రద్ధగా వినండి నరాశంస ముహమ్మద్ ప్రశంసింపబడతారు. 60 వేల తొంభై శత్రువుల మధ్య ఆయనను మేము పొందుతాము.

**(అధర్వణ వేదం 20వ కాండం - 127 వ సూక్తం 1వ మంత్రం)**
**అహమతి పితూహూ పరమేధా మృతస్య జాగ్రణి అహం సూర్యో ఇవాజనః (సామవేదం ప్రతి సర్గం అధ్యాయం 6, మంత్రం8)**

**అర్థం :** అహమద్ అనే అతను తన ప్రభువు నుండి ధర్మశాస్త్రం (ఖుర్ఆన్) పొందారు. ఆయన ప్రవక్తలకు తండ్రి లాంటివాడు. ఆ ధర్మశాస్త్రం ఎంతో జ్ఞానపూరితమైనది సూర్యని కాంతిలాగా ఆయన వెలుగును పొందాడు.

కేవలం వేదాలలోనే కాకుండా పురాణాలలో కూడా మహానీయ ముహమ్మద్ (స) వారి పేరుతో సహా ప్రస్తావించబడింది.

**ఏతస్మిన్నన్తరే మ్లేచ్ఛ ఆచార్యేణ సమన్వితః**
**మహామద ఇతి ఖ్యాత శిష్యశాఖా సమన్వితః**
**నృపశ్చైత మహాదేవం మరుస్థల నివాసినమ్.**

ఒక మ్లేచుడు (నిరక్షరాస్యుడు) పరదేశస్థుడైన ఒక బోధకుడు తన శిష్యులతో పాటు వస్తాడు. ఆయన పేరు ముహమ్మద్ ఆయన ఎడారి ప్రాంతానికి చెందినవారై యుంటారు.
**భవిష్య పురాణం ప్రతిసర్గ పర్వం 3ఃఅధ్యాయం 3 శ్లోకం 5-8**



ఆయన లింగచ్ఛేది (సున్నతి ఒడుగులు తలపై ముడి ఉండదు. గడ్డం పెంచుకొని ఉంటారు. మాంసాహారి. బిగ్గరగా గొంతెత్తి మాట్లాడతారు. ముసలై (ముసల్మాన్)గా పరిచయం చేయబడతారు.

**భవిష్య పురాణం ప్రతిసర్గపర్వం 3 అధ్యాయం 3 శ్లోకం 25-27**

**బుద్ధగ్రంథాలలో** కూడా మహానీయ మహమ్మద్ (స) వారి గురించి ప్రస్తావించబడింది. "నందా ! ఈ ప్రపంచంలో నేనే మొదటి మరియు చివరి బుద్ధుణ్ణికాను. నా తరువాత కూడా బుద్ధులు వస్తారు.. ప్రపంచానికి స్వచ్ఛమైన సంపూర్ణమైన జీవితవిధానాన్ని తెలియజేసే బుద్ధుడు కూడా రానున్నాడు ఓ నందా ఆయన **"మైత్రేయుడు".**

**(గాస్పెల్ ఆఫ్ బుద్ధా, కారుస్ పే॥ 217)**

**ఇదే విధంగా జైనమత గ్రంథాలలో కూడా** మహానీయ ముహమ్మద్ (స)వారి గురించి ప్రస్తావించబడింది. మహవీర్ జైన్ మరణించిన 1000 సం॥ తరువాత అంతిమ అవతారపురుషుడు జన్మిస్తాడని పేర్కొనడమైనది. మహవీర్ జైన్ క్రి॥పూ॥ 571లో మరణించారు. మహానీయ మహమ్మద్ (స) క్రీ॥శ॥ 571 లో జన్మించారు.



**బైబిల్‌లో ముహమ్మద్ (స)**

వారి సహోదరులలో నుండి నీవంటి ప్రవక్తను వారి కొరకు పుట్టించెదను. అతనినోట నామాట నుంచుదును. నేను అతని కాజ్ఞాపించునది యావత్తును అతడు వారితో చెప్పును. అతడు నా నామమున చెప్పు నామాటలను విననివానిని దాని గూర్చి విచారణ చేసెదను.

**(ద్వితి 18:18)**

**నోట్:** మోషే వారి జీవితాన్ని, ప్రవక్త ముహమ్మద్ (స) వారి జీవితాన్ని పరిశీలిస్తే ముహమ్మద్ (స) వారే మోషే వంటి ప్రవక్త అని మనకు స్పష్టంగా అర్థం అవుతుంది.

యేసు క్రీస్తు తన తర్వాత మరో ఆదరణకర్త (ముహమ్మద్) (స) వస్తారని ప్రవచించారు.

... అయితే నేను మీతో సత్యము చెప్పుచున్నాను. నేను వెళ్ళిపోవుటవలన మీకు ప్రయోజనకరము నేను వెళ్ళనియెడల ఆదరణ కర్త మీ యొద్దకు రాడు. నేను వెళ్ళిన ఎడల ఆయనను మీ యొద్దకు పంపుదును.

**(యోహాను 16:7-14)**

Contd...8

తండ్రి యొద్ద నుండి మీ యొద్దకు నేను పంపబోవు ఆధరణ కర్త అనగా తండ్రి యొద్ద నుండి బయలు దేరు సత్యస్వరూపి అయిన ఆత్మ వచ్చినప్పుడు ఆయన నన్ను గూర్చి సాక్ష్యమిచ్చును.

**(యోహాన్ 15:26)**

ఆయన సమస్తమును మీకు బోధించును... నన్ను గురించి సాక్ష్యమిచ్చును. నేను వెళ్ళని యెడల ఆయన రాడు. నేను వెళ్ళి ఆయనను పంపుదును. ఆయన మిమ్మల్ని సర్వ సత్యములోనికి నడిపించును..... ఆయన తనంతట తాను ఏమియూ బోధింపక వేటిని వినునో వాటిని బోధించి జరుగబోవు సంగతులు చెప్పును.

**(బైబిల్ యోహాను 15:15-16 అద్యాయాల నుండి)**

**నోట్ :** యేసు తర్వాత సుమారు 570 సం॥ల తర్వాత ఆయనలాగే ఏకేశ్వర సిద్ధాంతాన్ని బోధించిన ప్రవక్త ముహమ్మద్ (స) ఒక్కరే.

ఈ విధంగా వేద వేదాంగాలు మరియు బైబిలు మహమ్మద్ (స॥అ॥సం) గురించి ముందుగానే పేరుతో సహా తెలియజేశాయి. ఆయన మానవులందరికీ ప్రవక్త. ఆయన్ను అనుసరించడం మన కర్తవ్యం.



**అంతిమ దైవగ్రంథం ఖుర్‌ఆన్ః**

దేవుడు తన చివరి ప్రవక్తపై సుమారు 1500 సం॥ల పూర్వం 23 సం॥ల పాటు కొద్దికొద్దిగా తన దూత (జిబ్రీల్) ద్వారా ఖుర్‌ఆన్ అవతరింపజేసాడు. ఈ దూతే ప్రతికాలంలోను, ప్రతీ ప్రవక్త వద్దకు దైవ సందేశం తెచ్చారు. ఒక్కోసారి మానవ రూపంలో ప్రవక్తలకు కనిపించేవారు. కానీ ఈ దూతనే కొంత మంది మానవ అవతారంలో వచ్చిన దేవునిగా పొరపడ్డారు. ముహమ్మద్ (స) ప్రవక్త నిరక్షరాస్యులు. ఆయన దైవసహకారంతో ఖుర్‌ఆన్ గ్రంథాన్ని కంఠస్థం చేసుకుని తన అనుచరులచే కంటస్థం చేయించి హృదయ ఫలకాలలో భద్రపరచి మానవాళికి అందజేశారు. **ఇప్పటికీ దాదాపు 1500 సం॥లుగా మానవ ప్రక్షిప్తాలకు అతీతంగావున్న ఏకైక దైవ గ్రంథం ఖుర్‌ఆన్.**



దేవుడు ఒక్కో కాలానికి ఒక్కో చట్టం ఇచ్చాడు. ఈ కాలానికి ఖుర్‌ఆన్ చట్టం. దీని రక్షణ బాధ్యత దైవం స్వయంగా స్వీకరించాడు. కాబట్టి ప్రళయం వచ్చేవరకు అన్ని తరాలకు ఈ చట్టం మార్గదర్శకత్వం. ఎందుకంటే ఇది చివరి దైవ గ్రంథం. ముహమ్మద్ (స.అ.స) చివరి దైవ ప్రవక్త.

**దేవుడే ఖుర్‌ఆన్‌కు రక్షణః**

ఈ జ్ఞాపిక (ఖుర్‌ఆన్) దానిని మేము అవతరింపజేశాము. స్వయంగా మేము రక్షిస్తాము.

**(ఖుర్‌ఆన్ 15:9)**

**ఎలా అవతరించింది?**

ఇది సకల లోకాల ప్రభువు అవతరింపజేసింది. దీనిని తీసుకుని విశ్వసనీయమైన ఆత్మ (దైవదూత) నీ (ముహమ్మద్.స) హృదయ ఫలకంపై అవతరించింది.

**(ఖుర్‌ఆన్ 26:192-194)**



**ఇతర గ్రంథాలను సమర్థిస్తుంది:-**

గ్రంథ ప్రజలారా! ఇప్పుడు మేము (అల్లాహ్)అవతరింపజేసిన గ్రంథాన్ని (ఖుర్‌ఆన్‌ను) విశ్వసించండి. అది మీ వద్ద పూర్వం నుండే ఉన్న గ్రంథాన్ని ధృవపరస్తుంది. సమర్థిస్తుంది.

**(ఖుర్‌ఆన్ 4:47)**

ఇది పూర్వం వచ్చిన అన్ని గ్రంథాలను ధృవీకరిస్తుంది. నిజమని బలపరుస్తుంది.

**(ఖుర్‌ఆన్ 2:97)**

**మానవ రచనకాదుః**

మేము మా దాసుని (ముమమ్మద్) (స) పై అవతరింపజేసిన గ్రంథం గురించి ఇది మా గ్రంథం అవునో కాదో అనే సందేహమున్నట్లయితే దానివంటి ఒక భాగన్నైనా మీరు రచించి చూపించండి ?

**(ఖుర్‌ఆన్ 2:23)**

**అల్లాహ్ ఎవరు?**

ఏ దేవుడు గురించి అయితే మన ధార్మిక గ్రంథాలలో అవ్యక్తుడు, అగోచరుడు, అని ప్రస్తావించబడెనో ఆయననే అరబీ భాషలో అల్లాహ్ అని ప్రస్తావించడం జరిగింది.

**అల్లాహ్ మానవుల ప్రభువు** **(ఖుర్‌ఆన్ 114:1)**

మానవులారా ! మిమ్మల్ని మీకు పూర్వం వారిని సృష్టించిన మీ ప్రభువు (అల్లాహ్)ను ఆరాధించండి. దీని ద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది. **(ఖుర్ఆన్ 2:21)**

ప్రజలు అల్లాహ్‌కు విధేయతచూపే విధానాన్ని విడిచి మరొకదాన్ని కోరుతున్నారా? వాస్తవానికి భూమి ఆకాశాలలోని సకల వస్తువులు ఇష్టం ఉన్నా లేకున్నా అల్లాహ్ విధేయతకు కట్టుబడి విధేయులై ఉన్నాయి.

**(ఖుర్ఆన్ 3:83)**

మీరు అల్లాహ్ దాస్యం చేయండి. ఇదే ఋజు మార్గం.

**(ఖుర్ఆన్ 3:51)**

ప్రతీ వ్యక్తి తనను మరియు ఈ సమస్తాన్ని సృష్టించిన అల్లాహ్‌కు విధేయత చూపుట ద్వారా మాత్రమే తనను తాను రక్షించుకునే సరియైన మార్గం అని ఖుర్ఆన్ సందేశం ఇస్తుంది.



**అల్లాహ్ ఒక్కడే దేవుడు:**

ఒకవేళ ఆకాశంలో, భూమిలో ఒక్క అల్లాహ్ తప్ప ఇతర దేవుళ్ళు కూడా ఉంటే, అప్పుడు రెండింటి వ్యవస్థ చిన్నాభిన్నమై ఉండేది. **(ఖుర్ఆన్ 21:22)**

ప్రవక్తా! అల్లాహ్‌తో పాటు ఏ ఇతర దేవుణ్ణి వేడుకోకు, ఆయన తప్ప మరొక ఆరాధ్యుడెవ్వరూ లేడు. ఒక్క ఆయన ఉనికి తప్ప ప్రతీదీ నశించేదే.

**(ఖుర్ఆన్ 28:88)**

మరొక దేవుడెవడూ ఆయనతోపాటు లేడు. ఒకవేళ ఉంటే ప్రతి దేవుడు తన సృష్టిని తీసుకుని వేరుపడి పోయేవారు. తరువాత వారు ఒకరిపై ఒకరు దండయాత్రలు చేసుకొని ఉండేవారు. **(ఖుర్ఆన్ 23:91)**

ప్రవక్తా చెప్పండి. అల్లాహ్ ఒక్కడు, అద్వితీయుడు ఆయన ఎవరి ఆధారము అవసరమూ లేనివాడు. ఆయనకు సంతానము లేదు. ఆయన ఎవరి సంతానము కాదు. ఆయనకు సాటి సమానము ఎవరూ లేడు. **(ఖుర్ఆన్ 112:1-4)**



ఈ భూమ్యాకాశాలలో ఒక్క అల్లాహ్ తప్ప ఇతర దైవాలు ఎవరైనా ఉన్నట్లైతే విశ్వవ్యవస్థ అంతా అస్తవ్యస్తమైపోయి ఉండేది. దీనిని బట్టి కూడ సాటి సమానము లేని ఆ యజమాని ఒక్కడేనని ఇట్టే గ్రహించవచ్చు.

**మానవులు-ఒకే తల్లి దండ్రులు సంతానం:**

మానవులారా! మేము మిమ్మల్ని ఒకే పురుషుని నుండి, ఒకే స్త్రీ నుండి సృజించాము. తరువాత మీరు ఒకరినొకరు పరిచయం చేసుకునేందుకు మిమ్మల్ని జాతులుగాను, తెగలుగాను చేశాము. వాస్తవానికి మీలో అందరికంటే ఎక్కువ భయ భక్తులు కలవాడే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ గౌరవపాత్రుడు.

**(ఖుర్ఆన్ 49:13)**

అధికులు అధములని, నల్లవారు తెల్లవారనే ఏ బేధభావం లేదు. అందరూ ఒకే తల్లిదండ్రుల సంతానం పరస్పరం సోదరులు అని చెప్పడమే గాక మీలో గొప్పవాడు అందరికంటే దైవానికి ఎక్కువగా భయపడేవాడేనని ఇస్లాం సందేశం ఇస్తుంది.



**ప్రతీ ప్రవక్త సందేశం ఇదే :**

మేము నీకు పూర్వం ఏ ప్రవక్తను పంపినా అతని ద్వారా నేను (అల్లాహ్) తప్ప దేవుడు లేడు. కనుక మీరు నాకే దాస్యం చేయండి. అనే సందేశాన్ని ఇచ్చాము. **(ఖుర్ఆన్ 21:25)**

**ప్రతీ ప్రవక్తా మానవుడే :**

ఓ ప్రవక్తా నీకు పూర్వం కూడా మేము మానవులనే ప్రవక్తలుగా పంపాము. **(ఖుర్ఆన్ 21:17)**

**ప్రవక్తలుగా మానవులనే ఎన్నుకోవడానికి కారణం?**

భూమిపై దైవదూతలు తిరుగుతుంటే మేము తప్పకుండా ఆకాశం నుండి దైవదూతలనే వారి కోసం ప్రవక్తలుగా పంపి ఉండేవారము. **(ఖుర్ఆన్ 17:95)**

**నిర్బంధం లేదు:-** ఇది సత్యం. నీ ప్రభువు నుండి వచ్చింది. ఇష్టమైనవారు స్వీకరించవచ్చు ఇష్టం లేని వారు తిరస్కరించవచ్చు. **(ఖుర్ఆన్ 18:29)**

*Contd...10*

**అనుసరిస్తే వారికే మేలు :-** ప్రజలారా! మీ వద్దకు మీ ప్రభువు తరపు నుండి వివేచనా కాంతులు వచ్చేశాయి. ఇక దృష్టిని వినియోగించుకొనే వ్యక్తి తనకు తానే మేలు చేసుకుంటాడు. గుడ్డిగా వ్యవహరించే వ్యక్తి తానే నష్టపోతాడు.

**(ఖుర్ఆన్ 6:104)**

**తిరస్కరిస్తే - పర్యవసానం?**

నాశరహితుడైన సృష్టికర్తను (దైవాన్ని) తెలుసుకొనక బహు సం॥లు హోమ, యాగ, యజ్ఞ, తపస్సులు చేసిననూ ఎవడునూ సుస్థిరమైన స్థానమును పొందలేడు.

**(బృహదారణ్యక ఉపనిషత్తు 3:2:10)**

ఈ శ్లోకాన్ని అంతిమ దైవ గ్రంథమైన ఖుర్ఆన్ ఏ విధంగా ధృవపరుస్తుందో చూడండి !



'సత్యాన్ని విశ్వసించడానికి నిరాకరిస్తే మనిషి తన జీవితంలో సాధించినదంతా వ్యర్థమైపోతుంది. చివరకు అతను పరలోకంలో ఘోరంగా నష్టపోతాడు." **(ఖుర్ఆన్ 5:5)**

ఈ విధంగా ఆది నుండి మన గ్రంథాలన్నీ బోధిస్తున్న ఏకేశ్వరోపాసనను మరచిన మానవాళికి గుర్తుచేయడానికి చివరిసారిగా ఆ దేవుడు మనందరి కోసం పంపిన గ్రంథమే ఖుర్ఆన్. మన వేదవేదాంగాలు దేవుని ఏకత్వం గురించి చివరి ప్రవక్త ముహమ్మద్ (స॥అ॥స) గురించి అంత వివరంగా ప్రకటిస్తున్నప్పటికీ ఆ వేదాలను ఇతర గ్రంథాలను అధ్యయనం చేసిన మన పండితుల ద్వారా ఈ సత్యం మనదాకా చేకరపోవడం మన దురదృష్టం. కానీ ఈ కారణంగా మనం తప్పించుకోలేము. దైవం అందరికీ విచక్షణా జ్ఞానాన్ని మరియు ఆలోచనాశక్తిని ప్రసాదించాడు. కాబట్టి మనమే స్వయంగా మన బుద్ధిని వినియోగించి మన సృష్టికర్తను గుర్తించాలి.



**సోదరులారా!** "అందరికి దేవుడు ఒక్కడే" అన్న మన ధార్మిక గ్రంథాల సందేశాన్ని అందరికీ తెలియజేయాలనే తపనతో ఈ వాస్తవాలను తెలియజేయడం జరిగింది. రండి ! మనలోని బేధాలను, అసూయ ద్వేషాలను విడచి మనందరిని సృష్టించిన ఆ ఏకైక దేవుడినే ఆరాధిద్దాము. ఆయనకు సమానులుగా ఎవరినీ కల్పించక మనందరి కోసం ఆయన పంపిన చివరి గ్రంథం ఖుర్ఆన్ అనుగుణంగా అందరము కలిసి ఒక శాంతియుతమైన దైవ విధేయతా సమాజాన్ని స్థాపించు కుందాము. దేవుడు మనందరినీ కరుణించి సన్మార్గంలో నడిపిచుంగాక ! ఆమీన్

ఓ ప్రవక్తా! "దేవుడు ఒక్కడు" అన్న సందేశాన్ని వారు తిరస్కరిస్తే ఇలా అను మేము దైవ విధేయులం ఒకే దైవ దాస్యం చేసేవారము అన్న దానికి మీరు సాక్ష్యులుగా ఉండండి.

**(ఖుర్ఆన్ 3:64)**



**మనందరి దేవుడు ఒక్కడే - మనమంతా ఒక్కటే**

**మరిన్ని వివరాలకు సంప్రదించండి :**

*Contd...11*